ఎత్తిపోతలతో గట్టి మేలు



లంక గ్రామాలకు సాగునీటిని అందిస్తున్న బోరు బావి

- లంక భూములు సస్యశ్యామలం
- పథకం కోసం రైతుల ఎదురు చూపు
- పూర్తి చేయాలని విన్నపం

మామిడికుదురు: వైనతేయ గోదావరి నదీ తీరంలోని లంక గ్రామాల రైతులు సుదీర్ఘ కాలం నుంచి సాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. ఎంతో సారవంతమైన భూములు సరైన సాగునీరు లేక నిస్సారంగా మారి పోయాయి. భూగర్భం నుంచి వచ్చే జలాలు ఉప్పునీటి మయంగా మారడం రైతులను కలవరపెడుతోంది. ఉప్పు నీటి ప్రభావంతో కొబ్బరికాయల దిగుబడులు గణనీయంగా పడిపోయాయి. వేలాది రూపాయల వ్యయం చేసి ఏటా వేసవిలో రైతులు కొబ్బరి తోటలకు నీటి తడులు పెడుతున్నారు. దీని కోసం ఎన్నో వ్యయ ప్రయాసలు పడాల్సిన పరిస్థితి. ఎంతో మంది పాలకులు మారినా రైతుల పరిస్థితిలో మాత్రం మార్పు రావడం లేదు. లంక గ్రామాలకు సాగునీరందించే అప్పనపల్లి ఎత్తిపోతల పథకానికి కార్యాచరణ చేపట్టామని గత పాలకులు చెప్పినా ఫలితం శూన్యం. ఈ పథకం నిర్మాణానికి కార్యాచరణ చేపట్టామని అధికారులు చెబుతున్న మాటలు రైతుల్లో ఉత్సాహం నింపుతున్నాయి.

నాలుగు వేల ఎకరాలకు మేలు..

అప్పనపల్లి, పెదపట్నంలంక, పెదపట్నం, బి.దొడ్డవరం, మానేపల్లి గ్రామాలకు అప్పనపల్లి ఎత్తిపోతల పథకం ద్వారా మేలు జరుగుతుంది. చుట్టూ పుష్కలంగా గోదావరి జలాలు అందుబాటులో ఉన్నా ఆ జలాలు ఉప్పునీటి మయం కావడంతో ఇక్కట్లు తప్పడం లేదు. అప్పనపల్లి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టుకు రూ.46.46 కోట్ల వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేశారు. అయిదు గ్రామాల్లో 15 కిలోమీటర్ల పంట కాలువ ఏర్పాటుతో 4,035 ఎకరాల్లోని కొబ్బరి తోటలకు ప్రయోజనం కలుగుతుంది. దీంతో పాటు కొబ్బరి తోటల్లో అంతర పంటలు సాగు చేసుకునే అవకాశం ఉంటుంది. బ్రిటీషు వారి హయాంలో పై అయిదు గ్రామాలకు ఇరిగేషన్ సదుపాయం ఉండేది. ప్రస్తుతం ఈ గ్రామాలకు ఇరిగేషన్ సదుపాయం లేకపోవడంతో ఆ గ్రామాల రైతులు బోరు బావులపై ఆధారపడి కొబ్బరి సాగు చేస్తున్నారు. అప్పనపల్లి ఎత్తిపోతల పథకం కార్యరూపం దాల్చిన పక్షంలో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది.

ఎత్తిపోతల పథకం పూర్తి చేయాలి



సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఏటా ఒక తడికి ఎకరానికి రూ.అయిదు వేలు పైగా ఖర్చవుతుంది. వేసవిలో మూడు నీటి తడులు కట్టాల్సి ఉంది. దానికి గాను రూ.15 వేలు పైబడి ఖర్చు అవుతుంది. బోరు బావుల నుంచి వచ్చే నీరు ఉప్పునీరు కావడంతో తోటలు చవుడు బారి కొబ్బరి తోటలు దెబ్బతింటున్నాయి. అంతర పంటలు పండడం లేదు. సాగునీరు అందిస్తే చాలా మందికి మేలు జరుగుతుంది.

– జోగి వేణుగోపాలకృష్ణ, రైతు, పెదపట్నంలంక

సాగునీరు అందించాలి



నేను పదెకరాల్లో కొబ్బరి సాగు చేస్తున్నాను. ఎంతో సారవంతమైన భూములకు సరైన సాగునీరు లేక ఎందుకు పనికి రాకుండా పోతున్నాయి. సాగునీరు అందిస్తే లంక భూముల్లో బంగారం పండుతుంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఉప్పునీటితో వ్యవసాయం సర్వనాశనమైంది. గతంలో లంక గ్రామాల్లో ఎన్నో పంటలు పండించే వారు. నీటి సమస్యతో ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. సాగునీరు అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– కంకిపాటి హిమవంతరావు, రైతు, అప్పనపల్లి

మలేరియా నివారణకు ప్రత్యేక శ్రద్ధ వహించాలి



ఆలమూరులో ఇటుక బట్టీ కార్మికులకు మలేరియా నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న వెంకటేశ్వరరావు

ఆలమూరు: వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రస్తుత సీజన్‌లో సంభవించే మలేరియా జ్వరాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సారించాలని కొత్తపేట డివిజన్ మలేరియా సబ్ యూనిట్ అధికారి సీహెచ్ వెంకటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రమైన ఆలమూరులోని మూడు గ్రామ సచివాలయ పరిధిలో ఇటుక బట్టీ కార్మికుల కుటుంబాలను సందర్శించి పలువురికి మలేరియా నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. పరీక్షలు నిర్వహించి మలేరియా వ్యాప్తి చెందే విధానంపై అవగాహన కల్పించారు. అలాగే స్థానిక గ్రామ సచివాలయం ఆవరణలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో వైద్యాధికారి డి.సాయికిషోర్ నిర్వహించారు. సుమారు 150 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఎంపీహెచ్ఎస్ ముద్రగడ శ్రీనివాసరావు, వైద్యారోగ్య సిబ్బంది కె.సుమాంజలి, భాను, శ్వేత, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ పారిశుధ్య చర్యలు పాటించాలి



చింతలూరులో పారిశుధ్యం పరిస్థితిని పరిశీలిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పేందు వీలుగా ప్రతి శుక్రవారాన్ని పొడి వారం (డ్రైడే)గా పాటించి సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి కోరారు. ఫ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. రుబ్బురోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలను ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. దీనివల్ల క్రిమి, కీటకాలు దరి చేరవని, తద్వారా అంటు వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉండదన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి మెరుగైన ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పాలని ప్రజలను కోరారు. ఈసందర్భంగా వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది ఫ్రై డేను వివరిస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతి కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలమణి తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు.

బీజేపీ కోర్ కమిటీ సమావేశం

మలికిపురం: రాజోలు నియోజకవర్గ బీజేపీ కోర్ కమిటీ సమావేశం మలికిపురంలో గురువారం పార్టీ నాయకులు ఇందుకూరి అచ్యుతరామరాజు ఇంటి వద్ద జరిగింది. నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో మాజీ శాసనసభ్యుడు, రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీవేమా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఎన్డీఏకి 400 సీట్లు గెలిచే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని వచ్చే ప్రభుత్వం మోదీ సహకారంతో ఆంధ్రప్రదేశ్ మరింత అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు. ఉపాధి హామీ పథకం కార్డు సభ్యులను రైతులకు అనుసంధానం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు అడబాల సత్యనారాయణ, జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్, రాష్ట్ర కిసాన్ మోర్చా డ్రైనేజీ సెల్ కన్వీనర్ చంపాటి శివరామకృష్ణంరాజు, ఇందుకూరి అచ్యుతరామరాజు, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు చెల్లింది త్రినాథ్, నియోజకవర్గ కో కన్వీనర్ జొన్నలగడ్డ గోపాలకృష్ణ, మలికిపురం, సఖినేటిపల్లి మండల పార్టీ అధ్యక్షులు కాపిశెట్టి కనకేశ్వరరావు, పట్టపు సూర్య ప్రకాష్ రావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పారాయణను విజయవంతం చేద్దాం

అమలాపురం టౌన్: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో వచ్చే నెల 2న అమలాపురం కాపు కల్యాణ మండపంలో జరుగనున్న సహస్రగళ హనుమాన్ చాలీసా పారాయణ మహా యజ్ఞాన్ని భక్తులంతా సమష్టిగా విజయవంతం చేద్దామని ఆ పరిషత్ జిల్లా అధ్యక్షుడు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. స్థానిక నల్లా వీధిలోని శ్రీరామాలయం, సాయిబాబా ఆలయాల ప్రాంగణంలో శుక్రవారం జరిగిన పారాయణ మహా యజ్ఞ కార్యాచరణలో సుబ్రహ్మణ్యం మాట్లాడారు.

ఆకాశం.. అరుణవర్ణ శోభితం

శుక్రవారం కురిసిన భారీ వర్షం అనంతరం సూర్యాస్తమయాన సఖినేటిపల్లి మండలం అంతర్వేది పాలెం గ్రామంలో ఆకాశం అరుణవర్ణంలో ప్రకృతి ప్రేమికులకు ఇలా కనువిందు చేసింది.

– మలికిపురం



అంతర్వేదిపాలెంలో కనువిందు చేసిన ఆకాశం

క్లుప్తంగా

ఆగిన మట్టి పనులు



తొత్తరమూడిలో నిలిచిన మట్టి పనులు

అయినవిల్లి: మండలంలోని పలు గ్రామాల్లో జోరుగా మట్టి పనులు జరుగుతున్నాయి. రైతులు పంట పొలాల్లో పల్లం, మెరక పనులు ముమ్మరంగా చేయిస్తున్నారు. అలాగే పలువురు ఇళ్ల స్థలాలు మేరక చేయడం, లే అవుట్లు పూడ్చే పనులు చేస్తున్నారు. దీంతో ట్రాక్టర్లు, ప్రొక్లెయినర్ యజమానులకు వేసవిలో గిరాకీ ఏర్పడింది. దీంతో వివిధ గ్రామాల్లో ఎక్కడ పడితే మట్టి ముమ్మరంగా చేపట్టారు. మట్టి పనుల్లో వీరు బిజీగా ఉన్నారు. శుక్రవారం కురిసిన వర్షానికి ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. వేసవిలో మట్టిపనులతో నాలుగు కాసులు వెనుక వేసుకుందామంటే అకాల వర్షాలు వచ్చి తమ ఆశాలను అడి ఆశలు చేశాయని ట్రాక్టర్, ప్రొక్లెయినర్ ఓనర్లు, రైతులు వాపోతున్నారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షకు 45 మంది గైర్హాజరు

అంబాజీపేట: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన పదో తరగతి సప్లిమెంటరీ తెలుగు పరీక్షకు సంబంధించి 45 మంది విద్యార్థులు గైర్హాజరయినట్టు చీఫ్ సూపరింటెండెంట్ పి.రాంబాబు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ బి.ధర్మరాజు తెలిపారు. అంబాజీపేట, పి.గన్నవరం రెండు మండలాలకు సంబంధించి 77 మంది హాజరు కావల్సి ఉండగా 32 మంది విద్యార్థులు పరీక్ష రాశారన్నారు. పరీక్ష రాసే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకున్నామన్నారు.

చదవడం అలవాటు చేసుకోవాలి

అంబాజీపేట: భారత స్వాతంత్ర్య సమరయోధుల పుస్తకాలు, జనరల్ నాలెడ్జ్, కథల బుక్స్‌ను చిన్నతనం నుంచి అలవాటు చేసుకుంటే ఎన్నో విషయాలు తెలుస్తాయని గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ జి.శ్రీనివాస్ అన్నారు. వేసవి విజ్ఞాన శిక్షన తరగతుల్లో భాగంగా శుక్రవారం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు ఆరోగ్యం, అలవాట్లు, ప్రకృతి జీవన విధానంపై అవగాహన కల్పించారు. డ్రాయింగ్, ఇంగ్లీష్ సాహిత్యం, యోగా తదితర వాటిపై శిక్షణ ఇచ్చారు.

శాంతి సమావేశం

ఆత్రేయపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులకు శాంతి భద్రతలపై అవగాహన కల్పించారు. వచ్చే నెల 4న జరిగే ఓట్ల లెక్కింపు కార్యక్రమానికి అందరూ సహకరించాలన్నారు. భారీ ర్యాలీలు, బాణసంచా కాల్చడం, వాటర్ బాటిల్‌లో పెట్రోలు కొనుగోలు చేయడం అల్లర్లు సృష్టించడం లాంటివి చేయరాదని హెచ్చరించారు. కార్యక్రమంలో అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష కుంకుమార్చన



పాత బండారులంకలో కుంకుమార్చనలు చేస్తున్న మహిళలు

అమలాపురం రూరల్: పాత బండారులంకలో వేంచేసి ఉన్న పద్మావతి అలివేలు మంగా సమేత వేంకటేశ్వర స్వామివారి తీర్థ కల్యాణోత్సవాల సందర్భంగా శుక్రవారం సామూహిక లక్ష కుంకుమార్చన వైభవంగా జరిగింది. కారుపర్తి మల్లేశ్వరరావు, శిష్య బృందం అర్చకత్వంలో 108 మంది మహిళలు పూజలు చేశారు. ఆ ప్రాంతంలో గోవింద నామస్మరణ మార్మోగింది. గోవు చుట్టూ 5 ప్రదక్షిణలు చేసి ప్రత్యేక గో పూజలు చేశారు. మహిళలకు లక్ష్మీదేవి డాలర్, లడ్డూ ప్రసాదం, రవికుల వస్త్రం, గాజులు, పూజా మాట్, పూజా సామగ్రిని కమిటీ సభ్యులు ఉచితంగా అందజేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. తొలుత చింతపట్ల కృష్ణ రామ్మోహనరావు, విజయలక్ష్మి దంపతులచే అభిషేకాలు నిర్వహించారు. హైదరాబాద్ చెందిన కాశిన గణపతిశాస్త్రి, రేఖ దంపతులు స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఎంపీటీసీ సభ్యురాలు అంకం హిమభారతి, శ్రీనివాసా బాలమిత్ర సంఘ ప్రతినిధులు చింతపట్ల బాబు, అంకం నాగ సత్యనారాయణ, బిళ్ల విశ్వేశ్వరరావు, అంకం పెదరాజు, లెక్కింశెట్టి చందు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి ఆవుల మృతి

ముమ్మిడివరం: పొలాల్లో మేస్తున్న రెండు ఆవులు విద్యుదాఘాతానికి మృతి చెందాయి. కొత్తలంక పంచాయతీ పరిధిలో గంగుల శంకర్ అతని చిన్నాన్న గోవిందుకు చెందిన రెండు చివుడు ఆవులను శుక్రవారం కాలువ గట్టు సమీపంలో పొలాల్లోకి తీసుకెళ్లారు. అక్కడ అవి మేస్తుండగా విద్యుత్ స్తంభం దగ్గరలో ఒక విద్యుత్ తీగ తెగిపడి వాటిపై పడటంతో ఆ రెండు ఆవులు మృతి చెందాయి. ఆవుల మృతితో జీవనోపాధి కోల్పోయామని బాధితులు ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై డి.సురేష్‌బాబు కేసు నమోదు చేశారు.

దివ్యాంగ పిల్లలను స్కూల్‌లో చేర్పించండి



అంబాజీపేటలో అంగన్‌వాడీ కేంద్రం వద్ద వివరాలు సేకరిస్తున్న ఐఈఆర్టీ బేగం

అంబాజీపేట: దివ్యాంగ పిల్లలను గుర్తించి వారిని పాఠశాలలో చేర్పించే దిశగా సర్వే చేస్తున్నామని అంబాజీపేట భవిత సెంటర్ ఐఈఆర్టీ ఎస్కే బేగం అన్నారు. అంబాజీపేట, మాచవరం, గంగలకుర్రు తదితర గ్రామాల్లో దివ్యాంగుల పిల్లల గుర్తింపు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బేగం మాట్లాడుతూ సమగ్ర శిక్ష ప్రత్యేక ఉపాధ్యాయులు, భవిత కేంద్రం ఐఈఆర్టీలు ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శిస్తున్నామన్నారు. అంగన్‌వాడీ పరిధిలో ఉన్న 18 ఏళ్ల లోపు దివ్యాంగుల వివరాలను సేకరిస్తున్నామన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు దివ్యాంగ విద్యార్థులకు అందుతాయని వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి, భవిత సెంటర్, పాఠశాలలో పేర్లు నమోదు చేసుకుంటున్నామన్నారు.

ఓట్ల లెక్కింపు కేంద్రం పరిశీలన

కాట్రేనికోన: చెయ్యేరు శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలలో ఓట్లు లెక్కించే కేంద్రాన్ని శుక్రవారం కలెక్టర్ హిమాన్షు శుక్లా జిల్లాస్థాయి అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 4న ఓట్ల లెక్కింపును దృష్టిలో ఉంచుకుని శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలలో హైస్పీడ్ ఇంటర్నెట్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కౌంటింగ్ కేంద్రాలకు ప్రవేశ మార్గాలు, హైస్పీడ్ ఇంటర్నెట్ సౌకర్యం, 360 డిగ్రీల పరిధిలో సీసీ కెమెరాల అమరిక, పోటీలో ఉన్న అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్ల సౌకర్యార్థం మరుగుదొడ్లు, మౌలిక వసతులపై ఆరా తీశారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పోలింగ్ కేంద్రం వద్ద 20 తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి సురేష్ బాబును కలెక్టర్ ఆదేశించారు. విద్యుత్ సరఫరా నిరంతరాయంగా ఉండేందుకు చర్యలు చేపట్టాలని ట్రాన్స్‌కో ఈఈ రవికుమార్‌ను, హైస్పీడ్ ఇంటర్నెట్ ఏర్పాటు చేయాలని బీఎస్ఎన్ఎల్ ఇంజినీర్లను ఆదేశించారు. జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్, పంచాయతీ రాజ్ సూపరింటెండెంట్ ఇంజినీర్ కె.చంటిబాబు, ఆర్ అండ్‌బీ అధికారి రాము తదితరులు ఉన్నారు.

హోరు గాలి - జోరు వాన



అంబాజీపేటలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షం



పి.గన్నవరంలో కురిసిన భారీ వర్షానికి జలమయమైన రోడ్డు



సఖినేటిపల్లి మండలం వీవీ మెరకలో భారీ వర్షం

- రహదారులు అధ్వానం
- తడిసిన పచ్చి ఇటుక బట్టీలు

మలికిపురం: అల్పపీడనం నేపథ్యంలో శుక్రవారం నుంచి రాజోలు దీవిలో ఈదురుగాలులు, భారీ వర్షం పడుతుంది. దీంతో మాసూళ్లు పూర్తయిన వరి చేలలో గడ్డి పూర్తి తడిసి ముద్దయింది. రైతాంగం తీవ్రంగా నష్టపోయింది. అపరాలకు నష్టం ఉంటుందని రైతాంగం ఆందోళన చెందుతుంది.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: మండలంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలు, కాలనీలు, రోడ్లు జలమయం అయ్యాయి. పి.గన్నవరం మెయిన్ రోడ్డులో అడుగున్నర ఎత్తున వర్షం నీరు ప్రవహించింది. కళ్లాల్లో ఉన్న ధాన్యం బస్తాలు తడిసిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎండల తీవ్రతతో అల్లాడుతున్న ప్రజలు వర్షంతో కాస్త సేద తీరారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో శుక్రవారం మామిడికుదురు మండలంలో భారీ వర్షం కురిసింది. భారీ వర్షంతో రోడ్లపై భారీగా ముంపు నీరు నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మామిడికుదురు మెయిన్ రోడ్డు నుంచి కొర్లగుంట వెళ్లే గ్రావెల్ రోడ్డు అధ్వాపంగా మారింది. ఈ మార్గంలో ద్విచక్ర వాహనాలు జారిపోవడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. మామిడికుదురు, పాశర్లపూడి, నగరం గ్రామాల్లోని 216వ నంబర్ జాతీయ రహదారిపై భారీగా ముంపునీరు నిలిచిపోయింది. పెదపట్నంలంక, అప్పనపల్లి, బి.దొడ్డవరం, మొగలికుదురు, మగటపల్లి, ఈదరాడ, ఆదుర్రు, పాశర్లపూడిలంక, గోగన్నమఠం తదితర గ్రామాల్లో రోడ్లపై ముంపునీరు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



మామిడికుదురు కొర్లగుంట రోడ్డుపై నిలిచిన ముంపు నీరు

అంబాజీపేటలో..

అంబాజీపేట: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా అంబాజీపేటలో శుక్రవారం మధ్యాహ్నం సుమారు గంట పాటు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. ఈదురు గాలుల అనంతరం భారీ వర్షం పడింది. గత నెల రోజులుగా సూర్యుడి భగభగలు చూసి ప్రజలు హడలిపోయారు. ఈ పరిణామాలు చూసి మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో ఆకాశం నల్లటి మేఘాలు కమ్మి కన్నీరు కార్చింది. ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. మేఘాలు కమ్ముకున్నాయి. చిన్నా, పెద్దా అందరూ హమ్మయ్య... అంటూ ఉపశమనం పొందారు. గత 10 రోజుల క్రితం నుండి 41 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో జనంను బెంబేలెత్తించేలా ఎండలు పెరిగాయి. బయట అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కబోతలు, ఇంట్లో దోమల మోతతో జనం రోజూ ఇబ్బందులు పడేవారు. ఉదయం నుంచి మండుటెండటను గుప్పించిన సూర్యభగవానుడు మధ్యాహ్న సమయంలో వరుణుడికి ఆహ్వానం పలికి వాతావరణాన్ని చల్లబర్చాడు. కురిసిన వర్షానికి కొన్ని ప్రాంతాల్లో రహదారులు జలమయమయ్యాయి. జన జీవనానికి స్తంభించింది. చిరు వ్యాపారులు వర్షానికి ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఆలమూరులో..

ఆలమూరు: అల్పపీడన ప్రభావంతో మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం సాయంకాలం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. రహదారుల్లో వర్షపు నీరు నిండిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సరఫరాను రాత్రి పొద్దు పోయే వరకూ పునరుద్ధరించలేదు. ఇటుక బట్టీల కళ్లాలపై పచ్చి ఇటుక తడిసిపోవడంతో యజమానులకు తీవ్ర నష్టం వాటిల్లింది. కార్మికులకు మరో వారం రోజుల వరకూ పనులు చేసుకునే అవకాశం లేకుండా పోయింది. అలాగే కొన్ని చోట్ల ఖాళీ ప్రదేశాల్లో ఉన్న ధాన్యపు రాశులను ఒబ్బిడి చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. మండు వేసవిలో అకాల వర్షాలు కురవడంతో జనజీవనం అస్తవ్యస్తమైంది.



ఆలమూరులో ఇటుక బట్టీలో తడిసి ముద్దయిన పచ్చి ఇటుక

రావులపాలెంలో..

రావులపాలెం: మండలంలో భారీ వర్షం కురవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. శుక్రవారం సాయంత్రం సమయంలో పడిన వర్షంతో పల్లప్రాంతాలు జలమయం కాగా రోడ్డుపై వ్యాపారాలు చేసుకునే చిరు వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. అయితే విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కాకపోవడంతో సాయంత్రం వరకు చీకట్లు అలుముకున్నాయి.